రైలు పెద్ద రద్దీగా ఉన్నట్లు లేదు. అయినా, అది పూర్తిగా ఆగక ముందే దిగే వాళ్లని కూడా దిగనివ్వకుండా రమణ ఎక్కేశాడు.

ప్రతి దానికీ చిరాకుపడే మేనేజర్, కిటికీ పక్కన సీటు దొరక్కపోతే మరింత చికాకు పడతాడేమో నని అతని భయం.

వేగంగా వెళ్లి కిటికీ సీటు మీద సూట్ కేస్ పెట్టాడు. దిగే వాళ్లందరూ దిగాక, అప్పుడు కిందకి దిగాడు.

"సూట్ కేసు ఆ సీట్లో పెట్టాను, సార్!" అన్నాడు చేత్తో చూపిస్తూ.

రామారావు తలాడించాడు.

మేనేజర్ మెచ్చుకుంటూ ఏదన్నా అనక పోయినా, కనీసం చిరునవ్వు నవ్వుతాడేమో నని రమణ ఆశించాడు. అదీ అత్యాశే అయింది.

రామారావు మాటలు లెక్క పెట్టి మరీ మాట్లాడే మనిషి. అందునా తన కింది ఉద్యోగులతో అసలు మాట్లాడడు. ఎక్కువ మాట్లాడితే, వాళ్లకి తన మీద గౌరవం తగ్గి పోతుందని అతని అనుమానం.

అస లిప్పుడు తనఅంతస్తుకు తగ్గట్లు టాక్సీలో వెళ్దా మనే ప్రయత్నించాడు. ఎలక్షన్ టైమ్ అవడం వల్ల, టాక్సీ లన్నీ పార్టీలకు బుక్ అయిపోయాయి. అంచేత తప్పనిసరిగా రైల్లో బయల్దేరాల్సి వచ్చింది.

రైలు ప్రయాణా లంటేనే రామారావుకి ఎలర్జీ. అందునా పాసింజర్ ప్రయాణం. బండెడుసామాను వేసుకుని, అన్ని రకాల జనం ఎక్కుతారు. రెండు గంటలు వాళ్లతో కూర్చోవా లంటే తన డిగ్నిటీకి భంగం, కాదూ!

ఆ కారణంగానే, వెంటనే ఎక్కకుండా కిందనే నిలబడ్డాడు.

గార్డు విజిల్ వేశాడు.

"వస్తాను, సార్!" అంత వరకూ అక్కడే మౌనంగా నిలబడ్డ రమణ అన్నాడు.

ఎక్కి, లోపలికి నడుస్తూ రామారావు తల ఊపాడు మళ్లీ.

అతడు అనుమానించినట్లే దారికి అడ్డంగా పెట్టి ఉన్నాయి సామాన్లు.

ఒక పెద్ద గంప. అందులో రెండు మూడు రకాల కూరగాయలు. టౌన్లో అమ్ముకుని, తిరిగి వెళ్తున్న బాపతులా ఉంది. కొద్దిగానే ఉన్నాయి అందులో. పక్కనే పెద్ద టార్పాలిన్ సంచి, బిస్కెట్లు, వేరుసెనగ ఉండలు పాకెట్ల లాంటి తినుబండారాలతో నిండుగా ఉంది. పల్లెటూరి చిన్న పచారీ కొట్టుకు సరిపడా ఉన్నాయి అందులో. దానికి మరో పక్క రెండు ఖాళీ పాల బిందెలు, పాలు కొలిచే పాత్ర.

వాటినీ, వాటి ఓనర్లయిన ముగ్గురు ఆడ వాళ్లనీ, వాళ్ల పక్కనే కూర్చున్న విద్యార్థినినీ, జాగ్రత్తగా తప్పుకుని తన సీటు దగ్గరకి నడిచాడు.

కింద వేరుసెనగ తొక్కలూ, కమలాఫలాల తొక్కలూ కుప్పగా పడి ఉన్నాయి.

"మేనర్‌లెస్ ఫెలోస్!" విసుక్కున్నాడు.

ఎదురు సీట్లో కళ్లు మూసుకుని కూర్చున్న మనిషి సగం కళ్లు తెరిచి చూసి, తనని కాదని రూఢి చేసుకుని మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

ఆ ముగ్గురు ఆడ వాళ్లూ ప్రతి రోజూ ప్రయాణం చేసే వాళ్లలా ఉన్నారు. అందుకే ఇంట్లో కూర్చున్నంత తాపీగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

గొప్ప కళ్లు!

తెలుగరెడ్డి ప్రల్లయ్య



"చిన్న కోడలు నీళ్లోసుకుందా?" టార్పాలిన్ సంచి ఓనర్ అడిగింది.

"ఆళ్లకి అప్పుడే పిల్ల లొద్దంట. ఆసుపత్రి కెళ్లి లూపంట - అది ఏసుకొచ్చింది" కూరగాయల గంప ఓనర్ అంది.

"మన రోజుల్లో ఇలాంటి య్యేమీ తెలవక పోయె. పెళ్లయి ఏడాది తిరిగేతలికే బిడ్డ! ఆ బిడ్డ అడ్డాల్లో ఉండగానే, కడుపులో బిడ్డ. దాంతో రోగాలూ, రొస్టులు!" పాల బిందెల ఓనర్ అందుకుంది.

"మరే!" టార్పాలిన్ సంచి ఓనర్ ఒప్పుకుంది.

ఈ కబుర్లు వింటూ, సన్నగా ఉన్న ఆ విద్యార్థిని సిగ్గుతో తల దించుకుని ఇబ్బంది పడిపోతున్నది.

'ఇలాంటి విషయాలు బహిరంగంగా ఎలా చర్చించుకుంటారో? బొత్తిగా మేనర్స్ లేని మనుషులు!' విసుక్కున్నాడు రామారావు.

అతని విసుగుని మరింత పెంచుతూ, బయల్దేరిన రైలు పూర్తిగా ప్లాట్‌ఫాం దాటక ముందే ఆగి పోయింది.

"గొలుసు లాగుంటారు" పాలమనిషి అంది.

"రోజూ ఇదొక మేళం!" కూరగాయల మనిషి విసుక్కుంది.

కొద్ది నిమిషాల తర్వాత చిన్నగా మూలిగి రైలు బయలుదేరింది.

పాసింజర్ కాబట్టి పాసెంజర్ లాగానే నడుస్తున్నది. రెండు చిన్న స్టేషన్లు దాటింది. మూడో స్టేషన్లో ఆగి, మళ్లీ బయలుదేరింది.

ఒక కుర్రవా డెవరో పరుగెత్తు కొస్తూ కిటికీలో

నుండి చూసి "ఒరేయ్! అదిక్క డుందిరా!" అంటూ పెద్దగా అరిచాడు.

వెంటనే అతనూ, మరో ముగ్గురూ ఎక్కారు రన్నింగ్‌లోనే.

రామారావుకి ఆ కుర్ర వాడన్న దేమిటో అర్థం

కాలేదు వెంటనే. ఆ తర్వాత అర్థమై అవాక్కయి పోయాడు.

అత డన్నది ఆ విద్యార్థిని గురించి!

వాళ్ల వాలకం, మాట తీరూ ఎలా ఉన్నా, వాళ్లూ విద్యార్థులే అనుకోవాల్సి వస్తున్నది. ఇద్దరి చేతుల్లో నోట్‌బుక్స్, ఒకరి జేబులో కాలిక్యులేటర్, అరిచిన కుర్ర వాడి చేతిలోనూ, జేబులోనూ ఏమీ లేదు కానీ, నోట్లో సిగరెట్టు మాత్ర ముంది. అతడే పెద్ద హిప్పీ క్రాఫ్‌తో మిగిలిన వాళ్లకి నాయకుడిలా అనిపించాడు రామారావుకి.

లోపలికి వచ్చి, "మైనే ప్యార్ కియా!" అంటూ

సాహస బాలలు - 11

తన ప్రిన్సిపాల్‌ని కాపాడిన సాహస విద్యార్థిని గీత

రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో గల ఒక బాలిక, సీనియర్ సెకండరీ స్కూలు విద్యార్థినులంతా కలిసి గత సంవత్సరం జనవరి 24న బసంత్ పంచమి పండుగ సందర్భంగా దగ్గరలోనే ఉన్న ఒక చిన్న అరణ్యప్రాంతానికి వనవిహారం కోసం వెళ్లారు. దారిలో వారు జఖం అనే చిన్న నదిపై ఉన్న వంతెనమీద దాటి వెడుతుండగా ప్రమాదవశాత్తు మోనిక అనే ఆరవ తరగతి బాలిక పట్టు తప్పి ఆ నదిలో పడిపోయింది. ఆమెను రక్షించాలన్న ఆతురతతో శ్రీమతి గోస్వామి అనే ఒక ఉపాధ్యాయిని, ఆమెతోపాటు ఆ స్కూలు ప్రిన్సిపాల్ శ్రీమతి భార్గవ ఇద్దరూ ఆ నదిలోకి దూకారు.

అయితే వారి ప్రయత్నం ఫలించలేదు సరికదా, వారిద్దరూ కూడా నీటిలో మునిగిపోవడం ప్రారంభించారు. ఆ విపత్తును చూసిన 13 సంవత్సరాల (గరల్ గైడ్) బాలిక గీతా దామోర్ నదిలోకి అమాంతం దూకి ఎంతో ధైర్యంతో, సాహసంతో ఆ ముగ్గురిని ఒకరి తర్వాత ఒకరిని క్షేమంగా ఒడ్డుకు చేర్చింది. సమయానికి కుమారి గీత దామోర్ చూపిన తెగువ మూడు నిండు ప్రాణాలను కాపాడింది.

అనిపెద్ది వెంకట రమణరావు

ఆ పిల్ల వంక చూస్తూ కూనిరాగం తీస్తున్నాడు.

అందరూ వింటున్నారని కానీ, అందరూ చూస్తున్నారని కానీ, ఆ పిల్ల ఇబ్బంది పడుతున్నదని కానీ ఫీలింగే ఉన్నట్లు లేదు అతనికి.

"అరేయ్! దీన్ని నే నెక్కుతాన్రా!" సీట్లకి పై ఎత్తున, సామాను పెట్టే బల్ల మీద చేయి వేసి అన్నాడు.

అతడి చూపు ఆ అమ్మాయి మీద నుండి మరలడం లేదు.

ఆ శ్లేష అందరికీ అర్థ మవుతూనే ఉన్నది.

రామారావుకి ఒళ్లు మండిపోయింది. వాళ్ల మాటలు సంస్కారహీనంగా, రోడ్ల మీద తిరిగే పోకిరీ వెధవలు మాట్లాడే తీరులో ఉన్నాయి.

'ఏమిటీ న్యూసెన్సు?' అన్నట్లు కోపంగా కళ్లు పెద్దవి చేసి చూశాడు అతడి వంక.

ఆ కుర్రవాడు భయపడ లేదు సరి కదా, 'ఏంటి బే?' అన్నట్లు కళ్లెగరేస్తూ చూశాడు.

రామారావు సర్దుకున్నాడు. ప్చ్ ... లాభం లేదు. పూర్తిగా ముదిరి పోయిన కేసు. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఇలా అడ్డగాడిదలా తయా రయ్యాడు. కలగ జేసుకుంటే నా మర్యాద కూడా దక్కేటట్లు లేదు' అనుకున్నాడు.

'అయితే, వాడంత పచ్చిగా మాట్లాడుతూ, పబ్లిగ్గా ఆ పిల్ల నంత రభస చేస్తూంటే తను పిరికిపందలా ఊరుకుంటే తన మర్యాద ఏం కాను?' అసహనంగా కదిలాడు.

'కానీ తనేమైనా అంటే, వాడు చొక్కా పట్టుకుంటే తనకి మరింత అవమానం. తనంటే భయపడ్డానికి వాడు తన ఆఫీస్ స్టాఫ్ కాదే! 'అలవి కాని చోట అధికుల మనరాదు!' సూక్తి గుర్తు తెచ్చుకుని త నేమీ చూడనట్లు తల తిప్పుకుని కిటికీలో నుండి కనిపిస్తున్న ప్రకృతి అందాలు చూస్తున్నాడు.

ఆ కుర్రవాళ్లు నలుగురూ పై కెక్కారు. ఆ హిప్పీ కుర్రాడు "మైనే ప్యార్ కియా!' అంటూ మధ్య మధ్య కలవరించడం మాన లేదు.

"అరేయ్! కార్డు తియ్యరా, ఒక ఆటేద్దాం!" అన్నాడు అతడే.

రామారావు ఆశ్చర్యపోయాడు.

వాళ్లు పెన్ను, పుస్తకాలు తెచ్చుకోడానికి బద్ధకిస్తున్నారు కానీ, పేక ముక్కలు మాత్రం తెచ్చుకుంటున్నా రన్న మాట.

వాళ్లు ఆడుతూ కూడా మధ్య మధ్యలో కేకలు, అల్లరి మానలేదు. జోకు లేస్తున్నారు - అందులో ధారాళంగా బూతులు. అన్నీ వింటూ, చూస్తూ రామారావు తన చేతకానితనానికి ఉడికిపోతున్నాడు.

ఈ కుర్రవాళ్లు ఎక్కే వరకూ, స్వేచ్ఛగా కబుర్లు చెప్పుకుంటున్న ముగ్గురు ఆడవాళ్లూ మాట లాపేశారు. వాళ్ల కేకలతో, వీళ్ల సంభాషణ సాగడం లేదు. ఆ విద్యార్థిని మరీ ముడుచుకుపోతున్నది.

ఇంతలో ఒక పేక ఎగిరి వచ్చి ఆమె మీద పడింది. అది వాళ్లు కావాలని చేసిన పనే. పెద్దగా ఘనకార్య మేదో చేసినట్లు వేకిలి నవ్వులు.

"ఏందయ్యా ఈ ఆగం?" బిస్కెట్ల మనిషి సహించలేక పోయింది.

"మా ఇష్టం వచ్చినట్లు అరుస్తాం! నీకేంటి మధ్యలో?" హిప్పీ క్రాపు పొగరుగా సమాధానం చెప్పాడు.

"అదేంటయ్యా? పక్కన ఆడపిల్ల లున్నారు గందా! అట్టాగేనా మాట్టాడేది?" కూరగాయ లమ్మి అందుకుంది.

"ఏమిటీ తెగ బాధపడిపోతున్నారు. మీరూ ఆడ పిల్లలేనా ఏంటి?" అతడు మళ్లీ అన్నాడు పరిహాసంగా.

జోకేసినట్లు మిగిలిన ముగ్గురూ పెద్దగా నవ్వారు.

"ఏంట్రా కూస్తున్నావ్, బాడకావ్?" కోపంగా లేచింది కూరలమ్మి.

కొద్దిగా జంకాడు. కానీ అప్పుడు తగ్గిపోతే తన హీరో ఇమేజ్ దెబ్బతింటుంది. అందుకే కిందకి దిగి, "ఏమిటే వాగుతున్నావ్?" అన్నాడు.

రామారావు ఆ ఆడ మనిషి ధైర్యానికి విస్తుపోతూ చూస్తున్నాడు.

మరునిముషం రణరంగ మెపోయింది అక్కడ.

ఎవరు ముందు కొట్టారో అతని కర్థం కాలేదు.

హిప్పీ క్రాపు కుర్రవాడు మాత్రం "అమ్మోయ్! బాబోయ్!" అంటూ అరుస్తున్నాడు.

పరీక్షగా చూస్తే కూరలమ్మి చేతిలో చిరిగిన అతడి చొక్కా ఉంది. బిస్కెట్ల మనిషి చేతిలో అతడి జుట్టుంది. పాల మనిషి చేతిలోని పాలు కొలిచే పాత్ర అతడి వీపు మీద దరు వేస్తున్నది.

"పెద్ద పోటుగాడిలా దిగావ్, ఏం చేస్తావ్‌రా, దొంగనాయాలా? గుండు చేయిస్తాను, ఏమనుకున్నావో!" పెద్దగా అరుస్తున్నది కూరలమ్మి.

"నీకు అక్కాచెల్లెళ్లు లేర్రా, ముదనష్టపు ఎదనా! నీ బాబు అందరి నోళ్లు కొట్టి సంపాయిస్తూ ఉంటే, నీవు మట్టగుడిసిలా ఎగిరెగిరి పడ్తన్నావ్!" పాలమ్మి అరుస్తున్నది.

"ఈ నాకొడుకులికి గుండ్లు కొట్టించి, సున్నంబొట్లు పెట్టించాల!!" బిస్కట్లమ్మి అంటున్నది.

హిప్పీ క్రాపు, తన చొక్కా, జుట్టూ వాళ్ల చేతుల్లోంచి వదిలించుకుని పక్క పెట్టెలోకి పరుగెత్తాడు.

ఎప్పుడు జారుకున్నారో, మిగతా ముగ్గురూ అదృశ్య మైపోయారు.

"ఏంటమ్మా, ఇలాగైతే ఎలా నెగ్గుకొస్తావ్? అవనరం వడ్తే చెంపలు వగల కొట్టాల నాకొడుకుల్ని!" బిస్కెట్ల మనిషి హితబోధ చేస్తున్నది ఆ అమ్మాయికి.

"ఆళ్లొట్టి పిరికి సన్నాసులమ్మా! నువ్వు ముడుచుకుపోతంటే ఆళ్లు రెచ్చిపోతారు. ఒక్క సారి మాడు పగలగొట్టు, నీ యంక మళ్లా కన్నెత్తి చూడరు!" పాలమ్మి అనునయంగా చెబుతున్నది.

రామారావు ఎదురు సీట్లో ఉన్న మనిషి కళ్లు మూసుకునే ఉన్నాడు. నిద్ర పోతున్నాడో, నిద్ర నటిస్తున్నాడో, లేక ఈ గొడవ తనకి అనవసరం అనుకున్నాడో మరి!

రామారావు మాత్రం సంభ్రమంగా ఆ ఆడవాళ్ల వంకే చూస్తున్నాడు. అతని దృష్టికి వాళ్లిప్పుడు మేనర్స్ తెలియని మనుషుల్లాగా కనపడటం లేదు. తన కంటే గొప్ప వాళ్లలాగా కనిపిస్తున్నారు.